వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 6

గురువారం, మే 8, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## దద్దరిల్లిన కర్రెగుట్టలు

**ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టుల మృతి**

**18 మృతదేహాల స్వాధీనం.. కొనసాగుతున్న కూంబింగ్**



చర్ల, వెంకటాపురం : భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులతో కర్రెగుట్టలు ఎర్రబారాయి. బీజాపూర్ జిల్లా ఊసూరు ఠాణా పరిధిలోని ఈ గుట్టల్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన ఎదురుకాల్పుల్లో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌సాయి, హోంమంత్రి విజయశర్మ ఈ ఎదురుకాల్పుల

- మిగతా 2వ పేజీలో

# ఆపరేషన్ సిందూర్



## 9 టెర్రర్ క్యాంప్‌లు.. జస్ట్ 24 నిమిషాల్లో ఖతం..

న్యూఢిల్లీ : భారతీయ పౌరుల ఊపిరి తీసి హాయిగా సేద తీరుతున్న ఉగ్ర మూకలను ఊచకోత కోసింది ఇండియన్ ఆర్మీ. సరిగ్గా తెల్లవారుజాము సమయంలో ఊహించని రీతిలో అటాక్ చేసి ఆ నర రూప రాక్షసుల అంతు చూసింది. 9 ఉగ్ర శిబిరాలపై ఏక కాలంలో 24 క్షిపణులు దాడి చేసి సమస్తం నేలమట్టం చేశాయి. ఇంత విధ్వంసం కేవలం 24 నిమిషాల్లోనే పూర్తవడం విశేషం. పెళ్లై పది రోజులైనా కాకుండా, సింధూరానికి దూరమైన ఆడబిడ్డ కన్నీటి సాక్షిగా ఆపరేషన్ సిందూర్, పేరుతో ఉగ్రమూకల అంతు చూసింది ఇండియన్ ఆర్మీ. మే 7వ తేదీన తెల్లవారుజామున 1:05 నుంచి 1:30 గంటల వరకు భారత సైన్యం, నావికాదళం, వైమానిక దళం సంయుక్తంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించాయి. కేవలం 24 నిమిషాల్లోనే ఉగ్రమూకల స్థావరాలను నేలమట్టం చేశాయి.

**ఇండియన్ ఆర్మీ దెబ్బకు ఉగ్రవాదులు కకావికలం..**

24 క్షిపణులు ఏక కాలంలో ఎటాక్ చేయడంతో ఉగ్రవాదులు కకా వికలం అయ్యారు. పేలుడు సంభవించిన సమీపంలోని ఉగ్ర వాదులు భయంతో అటూ ఇటూ పరుగులు తీయడం ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

న్యూఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో.. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌తో కలిసి మాట్లాడుతూ ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా ఈ ఆపరేషన్ జరిగిందని అన్నారు. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలు జరిపిన దాడిలో ఒక నేపాలీ జాతీయుడు సహా 26 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. దీనికి ప్రతిచర్యగానే, ఈ అటాక్ అని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్ వ్యూహంలో మార్పును సూచిస్తుందని కల్నల్ ఖురేషి అన్నారు.గత మూడు దశాబ్దాలుగా, పాకిస్తాన్ పీవోజేకే, పాకిస్తాన్ అంతటా రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, శిక్షణా ప్రాంతాలు, లాంచ్ ప్యాడ్‌లు వంటి ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నిర్మిస్తోంది. ఈ ఆపరేషన్ ఆ సౌకర్యాలను కూల్చివేసి భవిష్యత్తులో దాడులను నిరోధించడానికి ఉద్దేశించింది అని ఆమె చెప్పారు. భారతదేశంపై మరిన్ని దాడులు జరగబోతున్నాయని మా నిఘా వర్గాలు సూచించాయి. అందుకే.. ఈ ఉదయం ఉగ్రవాద నిర్మూలనా ఆపరేషన్ చేపట్టాం. మా హక్కును మేము ఉపయోగించుకున్నాం. మా చర్యలు తీవ్రతరం కానివి. బాధ్యతాయుంగా ఉన్నాయి. ఉగ్రవాదుల మౌలిక




సదుపాయాలను కూల్చివేయడంపైనే దృష్టిసారించడం జరిగింది. అని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అన్నారు.

**దాడులు జరిగిన ఉగ్రస్థావరాలివే:**

ముజఫరాబాద్, కోట్లి, బహవల్పూర్, రావలకోట్, చక్స్వారీ, భీంబర్, నీలం వ్యాలీ, జీలం, చక్వాల్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఇండియన్ ఆర్మీ దాడులు చేసింది. ఇవన్నీ ఉగ్రవాద శిబిరాలకు

- మిగతా 2వ పేజీలో







## రాష్ట్రపతికి వివరించిన ప్రధాని



న్యూఢిల్లీ, మే 7. (వాయిస్ టుడే): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి భారత్.. పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకుంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో 30మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. దాదాపు 100 మంది మరణించినట్లు సమాచారం.. పాకిస్తాన్‌లో 4, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో 5.. మొత్తం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఆర్మీ నేలమట్టం చేసింది. మిస్సైళ్ల వర్షం కురిపించి.. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ అనంతరం తాజా పరిస్థితులపై ప్రధాని మోదీ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రధాని మోదీ కలిశారు. ఆపరేషన్ సింధూర్‌పై రాష్ట్రపతికి ప్రధాని మోదీ వివరించారు. అంతేకాకుండా.. ప్రస్తుత పరిస్థితులు.. మాక్ డ్రిల్ తదితర అంశాల గురించి చర్చించారు.పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసిన తర్వాత.. రాష్ట్రపతి ముర్ముతో భేటీకి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం మధ్యాహ్నం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. క్యాబినెట్ వర్గాల సమాచారం ప్రకారం, సమావేశంలో మోదీ తన క్యాబినెట్ సహచరులకు పాకిస్తాన్‌పై ప్రారంభించిన ఆపరేషన్ గురించి వివరించారు.భారత సైన్యం ఎటువంటి పొరపాటు లేకుండా, సన్నద్ధత ప్రకారం చర్య చేపట్టిందని కూడా ప్రధాని అన్నారు. ఇది గర్వకారణమైన క్షణం.. అంటూ ప్రధానమంత్రి సైన్యాన్ని ప్రశంసించారు. దీని తరువాత, కేంద్ర మంత్రివర్గంలోని మంత్రులందరూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.. దేశం మొత్తం ఆయనతో ఉందని అన్నారు. ఆపరేషన్ సింధూర్ గురించి రాజ్‌నాథ్ సింగ్ కేబినెట్ సమావేశంలో పలు విషయాలను వెల్లడించారు. మంత్రివర్గ సభ్యులందరూ టేబుల్ చప్పట్లు కొట్టి ఆయనను అభినందించారు.

**ఆపరేషన్ సింధూర్ పై అఖిలపక్ష సమావేశం..**

ఆపరేషన్ సింధూర్ వివరాలు వెల్లడించేందుకు ప్రభుత్వం గురువారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరగనుంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు కూడా ఈ భేటీలో పాల్గొననున్నారు.

## రేవంత్ ఫ్రస్టేషన్ దేనికి

హైదరాబాద్, మే 7, (వాయిస్ టుడే): “ నన్ను ఎవడూ నమ్మడం లేదు. అప్పులు పుట్టే పరిస్థితి లేదు. చివరికి బ్యాంకులు కూడా దొంగలను చూసినట్టు చూస్తున్నాయి. ఏ ప్రజా పథకం రద్దు చేయాలో మీరే చెప్పండి. వస్తున్నా ఆదాయం పింఛన్లకు, జీతాలకు, పాత అప్పుల వడ్డీలు కట్టడానికే సాలుతోంది”ఇవీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై చేసిన వ్యాఖ్యలు. ఒక రకంగా తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసినట్టుగా ఆయన ప్రకటించారు.. ఇది రేవంత్ రెడ్డి అనుభవలేమి, కెసిఆర్ చేసిన రుణాలకు ఇది ఒక మచ్చు తునక. అయితే రేవంత్ రెడ్డి పదేపదే కేసీఆర్ వల్లే ఇదంతా అని చెప్తే జనాలు నమ్మే పరిస్థితి లేదు. స్థూలంగా చెప్పాలంటే ఇది రేవంత్ రెడ్డి చేత కానితనానికి నిదర్శనం. “వాస్తవానికి మూడు లక్షల కోట్ల అప్పు ఉందని అప్పుడు చెప్పారు. ఇప్పుడేమో అది 8.5 లక్షల కోర్టుగా కనిపిస్తోందని” రేవంత్ రెడ్డి నిర్వేదం వ్యక్తం చేస్తున్నాడు. ఇది ఒక రకంగా డిబేటబుల్ ప్రశ్న అయినప్పటికీ.. ఎన్నికల సమయంలో అన్ని హామీలు ఇచ్చినప్పుడు రేవంత్ రెడ్డికి తెలంగాణ ఆర్థిక పరిస్థితి గురించి అవగాహన లేదా.. అంటే జనం ఓట్లు వేసిన తర్వాత.. తీరికగా ఇలాంటి సమాధానం చెబుదామని అనుకున్నారా.. జనాన్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఇలా మాట్లాడటం దీనికి సంకేతం.. అసలు ఈ జాబితాలో భారత రాష్ట్ర సమితి.. కాంగ్రెస్ పార్టీ రెండూ ఒకే తానులో ముక్కలు కదా. 2023 ఎన్నికల్లో కేసీఆర్ కూడా

- మిగతా 2వ పేజీలో



## అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబు

హైదరాబాద్, మే 7, (వాయిస్ టుడే): మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ రెడీ అయింది. ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రస్తుతం సందడిగా మారింది, వివిధ దేశాల నుంచి అందాల పోటీదారులు ఇక్కడ దిగుతున్నారు. విదేశీ ప్రతినిధులకు తెలంగాణ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. విమానాశ్రయంలో ప్రత్యేక లాంజ్‌లు, సమాచారం అందించేందుకు హెల్ప్ డెస్కలు ఏర్పాటు చేయబడ్డాయి. తెలంగాణ పర్యాటక ప్రాంతాలు, సంస్కృతి, ప్రత్యేక చిహ్నాలతో కూడిన స్వాగత

## ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

**అత్యవసర సేవల ఉద్యోగుల సెలవులు రద్దు**

**ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు**

**ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు**

**నేడు సంఘీభావ ర్యాలీ**

**హాజరు కానున్న సీఎం, మంత్రులు**



2లో

వాయిస్ టుడే

హైదరాబాద్
గురువారం, 8 మే 2025

# ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొందాం

హైదరాబాద్: “హైదరాబాద్‌లోని అన్ని విదేశీ రాయబార కార్యాలయాల దగ్గర కట్టుదిట్టమైన భద్రత చేపట్టాలి. ఐటీ సంస్థల దగ్గర పటిష్ఠ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయండి. పాత నేరస్థులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. వారి కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించండి. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉండాలి. హైదరాబాద్ నగరంలో పోలీసుల అప్రమత్తత చాలా ముఖ్యం. అవసరమైతే శాంతి కమిటీలతో మాట్లాడండి” అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ‘ఆపరేషన్ సిందూర్’ నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. “మనమంతా దేశ సైన్యంతో ఉన్నామనే సందేశం ఇవ్వాలి. ఈ సమయంలో రాజకీయాలకు, పార్టీలకు తావు లేదు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులందరూ అందుబాటులో ఉండాలి. విదేశీ పర్యటనలు రద్దు చేసుకోవాలి. అత్యవసర సర్వీస్‌లు అందించే విభాగాల ఉద్యోగుల సెలవులు రద్దు చేయండి. మీడియా, సోషల్ మీడియాలో ప్రభుత్వ ఉద్యోగులు అనవసర ప్రకటనలు చేస్తే కఠిన చర్యలు చేపట్టండి” అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దేశ రక్షణలో హైదరాబాద్ వ్యూహాత్మక ప్రాంతంగా, డిఫెన్స్ విభాగాలకు స్థావరంగా ఉన్నందున.. తాజా పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండేలా అన్ని విభాగాలకు దిశానిర్దేశం చేశారు. మాక్ డ్రిల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.

“ఎవరూ భయభ్రాంతులకు గురికావద్దు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా అనుమానాలుంటే వెంటనే పోలీసు విభాగానికి ఫిర్యాదు చేయండి. వైద్యం, పౌరసరఫరాలు, విద్యుత్ వంటి అత్యవసర సేవలు అందించే విభాగాలు 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉండేలా టోల్ ఫ్రీ నంబరు ఇవ్వాలి. పాకిస్థాన్, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి అనధికారికంగా వచ్చి నివసిస్తున్న వారిని తక్షణమే అదుపులోకి తీసుకోండి. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరించండి. బ్లడ్ బ్యాంకుల్లో రక్త నిల్వలు సిద్ధం చేసుకోవాలి. సైబర్ సెక్యూరిటీ విభాగం అప్రమత్తత చాలా ముఖ్యం.

**ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ పెట్టండి**

ఫేక్ న్యూస్, వదంతులు ప్రచారం చేసే వారిపైన ఉక్కు పాదం మోపండి. వారిపట్ల అత్యంత కఠినంగా



వ్యవహరించాలి. ఫేక్ న్యూస్‌ను అరికట్టడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయండి. అన్ని జిల్లా కేంద్రాలతో పాటు.. సున్నిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి. ఆయా ప్రాంతాల్లో భద్రతను పెంచాలి” అని ముఖ్యమంత్రి ఆదేశించారు. అక్కడి నుంచి బయటకు వచ్చిన సీఎం... బయట ఎండలో ఉన్న పాత్రికేయులను చూసి కాన్వాయ్‌ను ఆపారు. జర్నలిస్టులతో కాసేపు మాట్లాడారు. “ఆపరేషన్ సిందూర్‌ను చూసి ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. ప్రతి భారతీయుడు ఆర్మీకి బాసటగా నిలవాలి. సీఎంగా నా బాధ్యత నిర్వర్తిస్తున్నా. రాజకీయాలు కాదు.. దేశం ముందు. దేశంలోకి వచ్చి చంపుతుంటే చూస్తూ ఊరుకుంటే ఎలా? అన్ని విభాగాలను అప్రమత్తం చేశాం” అని వివరించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డీజీపీ జితేందర్, హోంశాఖ కార్యదర్శి రవిగుప్తా, ఇతర పోలీసు, స్థానిక మిలిటరీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇతర విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భారత సైన్యానికి సంఘీభావంగా గురువారం సాయంత్రం 6 గంటలకు ర్యాలీ నిర్వహించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం నుంచి నెక్లెస్ రోడ్డు వరకూ జరగనున్న ఈ ర్యాలీలో సీఎంతో పాటు మంత్రులు, ఉన్నతాధికారులు, పలువురు నేతలు పాల్గొంటారు. సైన్యానికి మద్దతుగా ఈ ర్యాలీలో యువత పెద్దఎత్తున పాల్గొనాలని సీఎం పిలుపునిచ్చారు.

**దిల్లీ నుంచి అత్యవసరంగా రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రి**

అధిష్ఠానం పిలుపు మేరకు దిల్లీకి వెళ్లాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన.. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో రద్దయింది. అంతకుముందే దిల్లీ చేరుకున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సీఎం ఫోన్ చేశారు. తక్షణం బయలుదేరి హైదరాబాద్ రావాల్సిందిగా సూచించారు. దీంతో బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు చేరుకున్న ఉప ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్, మాక్ డ్రిల్ తదితర పరిస్థితులపై వారిద్దరూ చర్చించారు. చేపట్టాల్సిన చర్యలపై ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. “హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆర్మీ, నేవీ కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. రక్షణ రంగానికి చెందిన సంస్థల దగ్గర భద్రతాపరమైన చర్యలు చాలా ముఖ్యం. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేయండి. తెలంగాణ పర్యటనకు వచ్చిన విదేశీ పర్యాటకులకు తగిన రక్షణ కల్పించాలి. కేంద్ర నిఘా బృందాలతో రాష్ట్ర నిఘా బృందాలు సమన్వయం చేసుకోవాలి” అని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశించారు.

**పౌరుడిగా సాయుధ దళాలకు అండగా నిలుస్తున్నా: సీఎం**

ఆపరేషన్ సిందూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ అంశంపై ‘ఎక్స్’లో స్పందించారు. “పాక్‌లోని ఉగ్రవాద కేంద్రాలపై భారత సైన్యం నిర్వహించిన నిర్దేశిత దాడులు దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేశాయి. ఈ సమయంలో ప్రతి పౌరుడు భారత సైనికులకు అండగా, సంఘీభావంగా, ఐక్యంగా నిలబడాలి. ఒక భారతీయ పౌరుడిగా నేను ముందుగా మన సాయుధ దళాలకు బలంగా... అండగా నిలుస్తున్నా. ఉగ్రవాద నిర్మూలన కోసం భారత సైన్యం చేపట్టిన ఈ ధైర్యవంతమైన చర్య దేశ భద్రతకు నిదర్శనం. మనమంతా ఒకే గొంతుకై, ఒకే స్వరంతో ప్రకటిద్దాం. జై హింద్!” అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.




(మొదటి పేజీ తరువాయి)

స్థావరాలుగా నిఘా సంస్థలు చాలా కాలంగా అనుమానిస్తున్నాయి. ఈ ప్రదేశాలు లష్కరే తోయిబా, జైషే మొహమ్మద్ లతో అనుబంధంగా ఉన్నాయని బలమైన ఆధారాలు కూడా ఉన్నాయి. ఈ రెండు ఉగ్రవాద సంస్థలు భారతదేశంలో అనేక సంవత్సరాలుగా దాడులకు పాల్పడ్డాయి. ఇక దాడికి గురైన తొమ్మిది ప్రదేశాలలో ఐదు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉన్నాయి. నాలుగు పాకిస్తాన్ ప్రధాన భూభాగంలో ఉన్నాయి. ముఖ్యంగా బహవల్పూర్ జెఎంకు బలమైన కోటగా ప్రసిద్ధి చెందింది. ముజఫరాబాద్, భీంబర్‌లను గతంలో భారత భద్రతా సంస్థలు కాశ్మీర్‌లోకి చొరబడటానికి రవాణా, లాజిస్టిక్స్ పాయింట్లుగా గుర్తించాయి. ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ సూపర్ సక్సెస్ అయ్యింది. లక్షిత స్థావరాలన్నీ ధ్వంసమయ్యాయి. శిక్షణా శిబిరాలు, ఆయుధ గోదాములు, స్టేజింగ్ సౌకర్యాల ధ్వంసమైనట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ విస్తృతంగా జరిగినప్పటికీ.. పాకిస్తాన్ సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదు.

**భారీ నష్టం:** భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో 70 మందికి పైగా ఉగ్రవాదులు మరణించగా, 60 మందికి పైగా గాయపడ్డినట్లు సమాచారం. భూమి నుండి, ఆకాశం నుండి ప్రయోగించే క్షిపణులను ఉపయోగించి భారత్ ఈ దాడులు చేసింది. నిఘా డ్రోన్‌ల ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణ.. తక్కువ పౌరుల ప్రాణనష్టంతో లక్ష్య చేధనను నిర్ధారించబడటానికి వీలు కల్పించిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.




## అందాల పోటీలకు భాగ్యనగరం ముస్తాబు

(మొదటి పేజీ తరువాయి)

తోరణాలు ప్రయాణికులను ఆకట్టుకుంటున్నాయి.. అటు.. మిస్ వరల్డ్ పోటీలపై అధికార, విపక్షాల మధ్య మాటలయుద్ధం కాక రేపుతోంది. ఈ క్రమంలో.. మంత్రి జూపల్లి కృష్ణారావు విపక్షాల విమర్శలపై స్పందించారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించేందుకే మిస్ వరల్డ్ పోటీలు.. అంటూ.. అందాల పోటీలపై విపక్షాల కామెంట్స్‌కు మంత్రి జూపల్లి కృష్ణారావు కౌంటర్ ఇచ్చారు. పెట్టుబడుల సంగతి ఎలా ఉన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీల సందడి మాత్రం షురూ అయింది. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఇప్పటికే సుమారు 90 మంది పోటీదారులు హైదరాబాద్ చేరుకున్నారు. వారిలో మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్ పెడ్రోసో, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే జాన్సన్‌వాన్ రెన్స్‌బర్గ్ వంటి వారు ఉన్నారు. పర్యాటక శాఖ అధికారులు వీరికి విమానాశ్రయంలో సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, అనంతరం వారిని బస ఏర్పాటు చేసిన హోటళ్లకు తరలించారు. ఈ మిస్ వరల్డ్ పోటీల్లో పాకిస్తాన్ కూడా ప్రాతినిధ్యం వహిస్తోంది. మిస్ పాకిస్తాన్ కూడా ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్నట్లు సమాచారం. ప్రపంచ సుందరీమణులతో హైదరాబాద్ కళకళలాడుతోంది, అంతర్జాతీయ స్థాయిలో నగరం ప్రతిష్టను పెంచే ఈవెంట్‌కు అంతా సిద్ధమైంది. ఈ నెల 10న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ పోటీలు ప్రారంభం కానుండగా.. 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నాయి. అదే రోజు విజేతను ప్రకటిస్తారు. జూన్ 2న జరిగే తెలంగాణ అవతరణ దినోత్సవం వేడుకల్లో మిస్ వరల్డ్‌గా నిలిచిన సుందరీమణి పాల్గొంటారు. ఈ పోటీలకు 116 దేశాలకు చెందిన పోటీదారులు హాజరుకానున్నారు. దాంతో.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి హైదరాబాద్ హైటెక్స్ వరకూ బ్యానర్లు, కటౌట్లు కళకళలాడిపోతున్నాయి. మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనేందుకు ప్రపంచ సుందరీమణులు ఒక్కొక్కరుగా హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. ఈ క్రమంలోనే.. మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో సెర్వాన్‌టెస్, మిస్ బ్రెజిల్ జెస్సికా స్కాండుజ్, మిస్ సౌత్ ఆఫ్రికా జోయాలిజే సహా దాదాపు 90 మందికిపైగా పోటీదారులు హైదరాబాద్‌లో అడుగు పెట్టారు. వారికి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో పర్యాటక శాఖ అధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ఆ తర్వాత అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్‌కు తరలించారు. మిస్ వరల్డ్ పోటీలకు హాజరయ్యే టీమ్‌లు బస చేసేందుకు హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్‌లో ఏర్పాట్లు చేశారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి ఏర్పాట్లను టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా.. మంత్రి జూపల్లిని మిస్ ఇండియా, మిస్ మెక్సికో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇదిలావుంటే.. మిస్ వరల్డ్ పోటీలపై రాజకీయంగా దుమారం రేగుతోంది. అకాల వర్షాలతో అన్నదాత ఆగమవుతుంటే వారి గోడు పట్టదా అంటూ రేవంత్ ప్రభుత్వంపై విపక్షాలు మండిపడుతున్నాయి. అటు.. కశ్మీర్‌లో కల్లోలం చెలరేగితే అందాల పోటీలు నిర్వహిస్తారా అని హిందూ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. అలాగే.. అందాల పోటీలను వ్యతిరేకిస్తూ మహిళా సంఘాలు ర్యాలీలు తీస్తున్నాయి.



## సమస్యలను అర్థం చేసుకున్నాం

### అధికారుల కమిటీ ఛైర్మన్ నవీన్ మిత్తల్

### ఉద్యోగుల ఐకాస నేతలతో కమిటీ భేటీ.. 57 డిమాండ్లపై చర్చ

హైదరాబాద్: ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించడానికి రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీ బుధవారం సాయంత్రం సచివాలయంలో తెలంగాణ ఉద్యోగుల ఐకాస నేతలతో సమావేశమైంది. కమిటీ సభ్యులు లోకేశ్ కుమార్, కృష్ణభాస్కర్ హాజరయ్యారు. సాయంత్రం 4.45 గంటలకు మొదలైన సమావేశం 6.45 గంటల వరకు సాగింది. ఉద్యోగుల డిమాండ్లు 57 ఉండగా... ఒక్కో దాని గురించి ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు చదివి వినిపించారు. ఉపాధ్యాయుల సమస్యలను ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉద్యోగుల డిమాండ్లను సంఘాల్లోని ఆయా శాఖల నేతలు కమిటీకి వివరించారు. ముఖ్యంగా 2003 డీఎస్సీలో నియమితులైన ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం అనుమతించినా పాత పింఛన్ విధానం అమలు చేయకపోవడం, సీపీఎస్ రద్దు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్థికేతర సమస్యలను పరిష్కరించాలని కొందరు డిమాండ్ చేశారు. కమిటీ ఛైర్మన్ నవీన్ మిత్తల్ స్పందిస్తూ.. డిమాండ్లను అర్థం చేసుకున్నామని, మరోసారి కమిటీ సమావేశమై అన్ని సమస్యలపై చర్చిస్తుందని చెప్పారు. మంత్రివర్గ ఉపసంఘం దృష్టికి తీసుకెళ్లి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఐకాస నేతలు దామోదర్‌రెడ్డి, చావ రవి, వంగా రవీందర్‌రెడ్డి, సదానందంగౌడ్, దేవరకొండ సైదులు, ముజీబ్ హుస్సేన్, ఎ.సత్యనారాయణ, బి.శ్యామ్, కస్తూరి వెంకట్, మధుసూదన్‌రెడ్డి, స్థితప్రజ్ఞ, కటకం రమేశ్, రామకృష్ణగౌడ్, ఎంబీ కృష్ణయాదవ్ తదితరులున్నారు.

## రేవంత్ ఫ్రస్టేషన్ దేనికి

(మొదటి పేజీ తరువాయి)



ఇలాంటి పథకాలే బొచ్చెడు అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాడు. పోనీ అధికారంలోకి వస్తే కేసీఆర్ వీటన్నిటిని అమలు చేసేవాడా? తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగోలేదని.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే సత్తా లేదని రేవంత్ రెడ్డి అంటున్నాడు. ఇదే మాట మీద రేవంత్ రెడ్డి నిలబడి ఉంటాడా.. దాదాపు అసాధ్యం. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీకి కొంతలో కొంత ఆర్థిక సర్దుబాటు ఇచ్చే రాష్ట్రం తెలంగాణ మాత్రమే. కర్ణాటక నుంచి పెద్దగా ఫాయిదా లేదు. హిమాచల్ ప్రదేశ్ నుంచి అంతగా హార్దిక భరోసా ఉండదు. సో ఏతా వాతా చూస్తే రేవంత్ రెడ్డి కంటే ముందు మీనాక్షి నటరాజన్ తెర ముందుకు వస్తుంది.. అధికారులతో భేటీలు పెడుతుంది. అధికారం ముఖ్యం.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రేవంత్ రెడ్డి ముందు ఒక ఫైల్ పెడుతుంది. చివరికి ప్రభుత్వమే రాజీ పడాలి. సరెండర్ అవ్వాలి. ఎందుకంటే ఉద్యోగులతో ఏ ప్రభుత్వం కూడా యుద్ధాన్ని కోరుకోదు. ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భవిష్యత్తులో చేసేది కూడా అదే. తమిళనాడు ముఖ్యమంత్రిగా జయ లలిత ఉన్నప్పుడు.. ప్రభుత్వ ఉద్యోగులకు చుక్కలు చూపించింది. ఉద్యోగులను తన కాళ్ళ మీద పడేవిధంగా చేసుకుంది. అయితే ఈ ఉదంతం రేవంత్ రెడ్డికి తెలియదా? రేవంత్ రెడ్డికి ఎవరూ చెప్పడం లేదా.. ఒకవేళ చెప్పిన రేవంత్ రెడ్డి వినిపించుకునే పరిస్థితి లేదా.. ప్రభుత్వ ఉద్యోగులు అంటే ఈ రాష్ట్రమనే కాదు దేశంలోని అని రాష్ట్రాలకూ ఒకరకంగా వాళ్ళు అల్లుళ్లు. ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికీ.. లోకం సర్వనాశనమైనా సరే.. రైతులు ఆత్మహత్య చేసుకున్నా.. మిడిల్ క్లాస్ ప్రజలు కన్నీళ్లు పెడుతున్నా.. నిరుద్యోగులు అవస్థలు పడుతున్నా.. జానే దాన్. ఎవడు ఎక్కడికి పోయినా పర్వాలేదు.. మేం చల్లగా ఉంటే చాలు అనుకునే ధోరణి ఉద్యోగులది.. ఇంత స్థాయిలో జీతాలు తీసుకుంటున్నప్పటికీ ఉద్యోగులలో జవాబు దారితనం ఉందా అంటే? వీసమెత్తు కూడా ఉండదు. పైగా ఉద్యోగుల జీతాల కోసమే రాష్ట్రాల ఆదాయంలో పావు వంతు వెళ్తోంది.. అనేక కేసుల్లో పట్టుబడుతున్నప్పటికీ ఉద్యోగ సంఘాల నాయకులు తాము పనితీరు మార్చుకుంటామని.. అవినీతికి పాల్పడమని ఇంతవరకు చెప్పిన దాఖలాలు లేవు. పోనీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లించిన రేవంత్ రెడ్డి ఉద్యోగుల మీద ఎప్పుడైనా దృష్టి సారించాడా? లేదా అవినీతి కేసుల్లో సీరియస్ గా ఎఫర్ట్ పెట్టాడా? ఇంతవరకు ఒక్కరికైనా శిక్ష పడిందా? కనీసం ఒక అవినీతి అధికారైన జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడా.. వందల కోట్లు మింగినా.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినా.. ఇప్పటికీ అదే డిపార్ట్మెంటల్ ఎంక్వయిరీ పేరుతో కేసుల్ని పక్కదారి మళ్ళి ప్రయత్నమే జరుగుతుంది. చివరికి అవినీతి కేసుల్లో ఇరుక్కుపోయిన ఉద్యోగులను అదే పోస్టులలో నియమించి తరిస్తోంది ఈ ప్రభుత్వం. ప్రక్షాళన పక్కనపెట్టి.. చేయాల్సిన పనులను పక్కనపెట్టి.. నన్ను కోసుకున్నా రూపాయి కూడా లేదని రేవంత్ రెడ్డి చెప్పడం నిజంగా పాలన లేమితనం.. ఇక్కడ కేసీఆర్ గొప్పోడని కాదు. ఆయనేం శుద్ధ పుస అని కాదు. ఈ జాబితాలో అటు రేవంత్ రెడ్డి.. ఇటు కెసిఆర్ దొందూ దొందే!

## దద్దరిల్లిన కర్రెగుట్టలు

(మొదటి పేజీ తరువాయి)

ఘటనను ధ్రువీకరించారు. డ్రోన్ కెమెరాలు, వైమానిక దళ హెలికాప్టర్లు, ఇతర అత్యాధునిక సాంకేతికతతో మావోయిస్టుల కదలికలను గుర్తించి.. బలగాలు కూంబింగ్ చేపడుతున్నాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటివరకు 18 మంది మావోయిస్టుల మృతదేహాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. భీకర ఆపరేషన్ కొనసాగుతోందని వెల్లడించారు. దిల్లీ నుంచి సీఆర్పీఎఫ్ డీజీ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్, ఛత్తీస్‌గఢ్ నక్సల్స్ ఆపరేషన్ ఏడీజీ వివేకానంద సిన్హా, బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షిస్తున్నారు. ఆ ప్రాంతంలో భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, తెలంగాణలోని ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల సరిహద్దుల్లో విస్తరించిన కర్రెగుట్టల ప్రాంతంలో గత నెల 22న ప్రారంభమైన ఆపరేషన్ 16 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతోంది. ఇక్కడ రెండు రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందగా.. గత నెల 24న ఎదురుకాల్పుల్లో ముగ్గురు పీఎల్‌జీఏ సభ్యులు మృతి చెందిన సంగతి తెలిసిందే. లొంగిపోవడం మినహా మావోయిస్టులకు మరో మార్గం లేదని ఐజీ



సుందర్‌రాజ్ మరోసారి స్పష్టం చేశారు. కర్రెగుట్టల్లోని దోబే, నీలంసాయి, డోలి, తడపలలో తాత్కాలిక బేస్ క్యాంపులను ఏర్పాటు చేసిన భద్రతా బలగాలు.. కీలకమైన మరో కొండ ప్రాంతాన్ని అధీనంలోకి తెచ్చుకునేందుకు అడుగులు వేస్తున్నాయి. కర్రెగుట్టల్లో ఆపరేషన్‌లో చిత్రీకరించిన వీడియోల్లో తొలిసారి హెవీ మెషీన్ గన్ (హెచ్‌ఎంజీ)ను గుర్తించినట్లు తెలిసింది. దీనికి తూటాలతో కూడిన బెల్ట్‌ను సెట్ చేసి వాడుతుంటారు. ఆ బెల్ట్‌లో 235 తూటాలు ఉంటాయి. ఒక్కసారి ట్రిగ్గర్ నొక్కితే అన్నీ అయ్యే వరకూ గుళ్ల వర్షం కురిపిస్తుంది.

# రాజ్యాంగం పూర్తిగా అమలు కావడం లేదు

**రాజ్యాంగ ఫలాలు అందరికీ అందడం లేదు**

**రాజ్యాంగం అమలు పూర్తి స్థాయిలో లేనందువలనే కుల మత విద్వేషాలు**

**స్వతంత్ర భారతంలో అధికారంలో ఉన్న ఏ ఒక్క పార్టీ రాజ్యాంగాన్ని అమలు పరచడంలేదు**

**ప్రతి పార్టీ రాజ్యాంగ సవరణలు మీద దృష్టి తప్ప అమలు చేయడంలేదు....ఆవేదన వ్యక్త పరిచిన కవులు,కళాకారులు**

**రాజ్యాంగం ఆవశ్యకత వంటి గొప్ప కార్యక్రమం చేపట్టిన దరువు అంజన్న కు వక్తల అభినందనలు**




కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): తెలంగాణా భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, తెలంగాణ కలాల గళాల వేదిక చైర్మన్ దరువు అంజన్న ఆధ్వర్యంలో ,చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో, భారత రాజ్యాంగము ఆవశ్యకత పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కవులు ,కళాకారులు, పాత్రికేయులు ,పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ, రాజ్యాంగం ఆవశ్యకత అనే అంశంపై వర్క్ షాప్ నిర్వహిస్తున్న కవి, గాయకులు దరువు అంజన్న ను అభినందిస్తూ.. డాక్టర్ బిఅర్ అంబేద్కర్ భారత ప్రజల అభ్యున్నతికై రచించిన రాజ్యాంగం వల్ల భావ ప్రకటన స్వేచ్ఛ మనకు లభించిందని,కానీ ప్రస్తుతం దేశంలో పూర్తి స్థాయిలో రాజ్యాంగం అమలు జరగడం లేదు అని,రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలు జరిగితే సమానత్వం ,సౌభ్రాతృత్వంతో కలిసి మెలిసి ఉండేవారని, కులాలు ,మతాలు అంటూ విద్వేషాలతో జీవిస్తున్నారని,ఇన్నేళ్ల స్వతంత్ర భారతంలో ఏ ఒక్క రాజకీయ పార్టీ రాజ్యాంగం అమలుకు పూర్తి స్థాయిలో కృషి చేయడం లేదని తెలిపారు, ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు, పాశం యాదగిరి,బత్తుల సిద్దేశ్వర్ పటేల్,ఆస్కాని మారుతి సాగర్, సుప్రజ హాస్పిటల్ డైరెక్టర్ విజయ్, రాష్ట్ర అధ్యక్షులు జిలకర శ్రీనివాస్, సొంటి రెడ్డి పున్నా రెడ్డి,గడ్డమీది బాల్ రాజ్,సి పి ఎం నాయకుడు ఉమా మహేష్, జర్నలిస్ట్ సుగ్రీవుడు, చిరుమర్తి రాజు, బైరాగి మోహన్ రాచకొండ రమేష్, విశ్వనాధుల పుష్పగిరి, మల్లేష్,అంజి బాబు, జర్నలిస్ట్ భాస్కర్, వాసాల బాలరాజ్,సాయిరాజ్, ప్రసన్న అక్క,కవులు ,కళాకారులు ,పాత్రికేయ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## అపురూప కాలనీలో మన్యం దొర "అల్లూరి వర్ధంతి వేడుకలు"

**ముఖ్యఅతిథిగా హాజరైన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): 130 – సుభాష్ నగర్ డివిజన్ అపురూప కాలనీ చౌరస్తాలో నిర్వహించిన మన్యం దొర అల్లూరి వర్ధంతి కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....ధైర్యం, త్యాగం, దేశభక్తి, స్వాతంత్ర పోరాటంలో చిరస్మరణీయంగా నిలిచిన మహోన్నత వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని అన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు పందిరి యాదగిరి, గుబ్బల లక్ష్మీనారాయణ, పిఎస్ఎన్ రాజు, రామకృష్ణ, వల్లభనేని రమణ, శేషా చారి, దుర్గా రావు, టెంపుల్ కమిటీ ప్రెసిడెంట్ తిప్పా రెడ్డి, సెక్రెటరీ కంచ కృష్ణమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజబాబు, కోశాధికారి మస్తాన్ బాబు, కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ కార్డులు జారీ చేయాలి

**టిపిసిసి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి**

కూకట్ పల్లిబీ మే 7(వాయిస్ టుడే) తెలంగాణ పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)ను టిపిసిసి లేబర్ సెల్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు కాందాడి సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో లేబర్ సెల్ నాయకులు సప్పిడి భాస్కర్, కర్కల ఉపేందర్ రెడ్డి, కావలి గోపాల్ ముదిరాజ్, మండల సంపత్ కుమార్ గౌడ్ తో కలసి టిపిసిసి లేబర్ సెల్ మరియు ఐఎన్టీయుసీ తరపున వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్మికుల సంక్షేమ%శీ% కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వారా మీ ద్వారా కార్మిక చట్టం లో మార్పు తీసుకొచ్చి భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ యజమానులకు, డెవలపర్స్, కాంట్రాక్టర్స్, బిల్డర్స్, లకు సంబంధిత శాఖ ల ద్వారా ప్రత్యేక షరతులు విధించి అర్హులైన ప్రతిఒక్క గృహ నిర్మాణ కార్మికుడికి తప్పనిసరిగా భవన నిర్మాణ కార్మిక సంఘం వెల్ఫేర్ కార్డులు ఉండేల చూస్తే కార్మికులకు వారి కుటుంబానికి మీ ద్వారా ప్రభుత్వం ద్వారా మేలు జరుగుతుందని కోరారు. అలాగే రాష్ట్రం లో ప్రతి నియోజకవర్గం లో కార్మిక శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు పెట్టి కార్మికులకు లబ్ది చేయగలరని అభ్యర్థించారు. ఈమేరకు మంత్రి సీతక్క స్పందించి ప్రిన్సిపాల్ సెక్రటరీ కార్మిక ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎం. దానకిషోర్ తో మాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## శత్రుపూరిత పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**– బాలానగర్ డిసిపి సురేష్ పిలుపు**

కూకట్ పల్లి: మే 7(వాయిస్ టుడే) : శత్రుపూరిత పరిస్థితులను, శత్రువుల దాడుల ఎదుర్కోవడానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలానగర్ డిసిపి సురేష్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలమేరకు బుధవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో బాలానగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ డ్రిల్ కార్యక్రమానికి బాలానగర్ డిసిపి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిపి సురేష్ కుమార్ మాట్లాడుతూ అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండి సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. ఇండ్లపై జరిగే దాడుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కోరారు. జనసందోహం ఎక్కువగా ఉన్నటువంటి హెూటళ్లు, సినిమహాళ్లు, ఫంక్షల్ హాల్లో కుండురంగా ఉండాలని కోరారు. అధికారిక వర్గాల నుండి వచ్చే సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని, ధృవీకరించని మూలాలపై ఆధారపడవద్దని సూచించారు. విధులను నిర్వహిస్తున్న పోలీసులు, మిలిటరీ అధికారులు, వాయు సేన అధికారుల ఫోటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పెట్టవద్దని కోరారు.

## సర్వేనెంబర్ 354 లోని ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా ఆధికారులకు అభినందనలు

**సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్**



కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): కె ఎల్ యూనివర్సిటీ కబ్జా చేసిన ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని, అలాగే సర్వేనెంబర్ 354లో ఉన్నటువంటి 12ఎకరాల భూముల లో నిర్మాణమైన అక్రమ నిర్మాణాలను నిన్న సాయంత్రం హైడ్రాధికారులు కూల్చివేసి అక్కడ ప్రభుత్వ భూమి అని తెలిపే బోర్డులను ఏర్పాటు చేయడాన్ని సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సమితి అభినందిస్తుందని ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేఎల్ యూనివర్సిటీ,అదేవిధంగా 354లో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను కాపాడాలని గత కొద్ది రోజులుగా పత్రికా విలేకరులు, కొన్ని సామాజిక సంస్థల నాయకుల తో పాటు సిపిఐ పార్టీగా ప్రభుత్వ అధికారులకు ఆ స్థలాన్ని కాపాడాలని అనేక వినతులు ఇచ్చిందని అందులో భాగంగానే నేడు హైడ్రా అధికారులు కాపాడారని ఈ ప్రభుత్వ భూములను కాపాడటానికి ప్రయత్నించిన ప్రతి ఒక్కరికి సిపిఐ పార్టీ అభినందనలు తెలియజేస్తున్నది, ఈ నియోజకవర్గంలో ఉన్నటువంటి రాజకీయ పార్టీలు ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు మాట్లాడకపోవడం దారుణమని దీన్ని ప్రజలందరూ గమనిస్తున్నారని ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు కుత్బులాపూర్ నియోజకవర్గంలో పోరాటం చేస్తున్న ఒకే ఒక పార్టీ సిపిఐ మాత్రమేనని అన్నారు. హైడ్రా అధికారులు కేవలం సర్వే నెంబర్ 354లోని భూములనే కాకుండా గాజులరామారంలో సర్వేనెంబర్ 329, 342, 326, 307, లలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కూడా కాపాడాలని కేవలం ఒక దగ్గర కాపాడి మరోచోట కాపాడకపోవడాన్ని అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. కావున ఇలాంటి అనుమానాలకు తావు లేకుండా హైడ్రా అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి అన్యాక్రాంతమైన టువంటి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని ఇండ్లు ఇండ్ల స్థలాలు లేని పేదలను కలుపుకొని ప్రభుత్వ భూములను కాపాడుకుంటామని అది ప్రజలదే కాబట్టి ప్రజలకు చెందేలా పోరాటం చేస్తామని ఆ దిశగా ప్రజలను సమీకృతం చేసామని వారిని పోరాటాల కోసం సన్నద్ధం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కొరకు ఇప్పటికైనా మిగతా రాజకీయ పక్షాలన్నీ సిపిఐ పార్టీ చేసే పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు, అది నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడుతుందని తెలిపారు.



## మణికొండలో ఘనంగా వాసవి మాత జయంతి ఉత్సవాలు

రాజేంద్ర నగర్ 7 మే( వాయిస్ టుడే): (ఆవొపా) AVOPA (Arya Vysya Officer s and Professional association) పుప్పాలగూడ శాఖ అధ్యక్షుడు ధరం వేణుమాధవ్ ఆధ్వర్యంలో భాగ్యలక్ష్మి కాలనీలో వాసవి మాత జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో మణికొండ లో ఉన్నటువంటి వాసవి మహిళలందరూ గత తొమ్మిది రోజుల నుంచి పారాయణం పట్టిస్తూ ఈరోజు ఘనంగా జయంతి ఉత్సవాలలో పాల్గొనడం జరిగింది.గత తొమ్మిది రోజులుగా నవరాత్రులని ఒక్కొక్కరింట్లో ఒక్కొక్క అవతారంలో పూజలు చేసి అమ్మవారికి బుధవారం రోజు ఘనంగా జయంతి ఉత్సవాలు జరపడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొడ్డు శ్రీధర్ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు స్రవంతి మరియు తదితరులు పాల్గొనడం జరిగింది.




## జై భీమ్ జై బాబు జై సంవిధాన్ కార్యక్రమం

జూబ్లీహిల్స్ 7 మే (వాయిస్ టుడే) సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్ గారి అధ్యక్షతన జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇన్చార్జి మహమ్మద్ అజారుద్దీన్ గారి ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎల్లారెడ్డి గూడా పీ జే ఆర్ కమిటీ హాల్ లోని జై భీమ్ జై బాబు జై సంవిధాన్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది.. ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథులుగా.కిచ్చన్న లక్ష్మారెడ్డి (KLR)మరియు. సిద్దేశ్వర్. పాల్గొనడం జరిగింది.. ఈ యొక్క సమావేశం కు లిరహమత్ నగర్ డివిజన్ కార్పొరేటర్స్. సిఎన్ రెడ్డి.బాబా ఫసియుద్దీన్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్ కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ అసద్ ఉద్దీన్... నవీన్ యాదవ్. రహేమత్ నగర్ కాంటెస్టెంట్ కార్పొరేటర్ భావాని శంకర్..జూబ్లీహిల్స్ యూత్ లీడర్ కాలేదు.. కిరణ్ యాదవ్... మనోజ్ యాదవ్.. సయ్యద్ హుస్సేన్..ఫెరోజ్. ఇతర కాంగ్రెస్ బూత్ కమిటీ మెంబెర్స్ నాయకులు పాల్గున్నారు..



## దళిత ఐక్యానికి మార్గదర్శిగా దామోదరం సంజీవయ్య సేవలు

**ఘనంగా వర్ధంతి వేడుకలు**

కుత్బుల్లాపూర్ మే 7(వాయిస్ టుడే): ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రిదామోదరం సంజీవయ్య సేవలు మరువలేనివి ఆల్ ఇండియా రాష్ట్ర దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్యగౌడ్ జగదీర్ గుట్ట మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ కార్యాలయంలో ఘనంగా వర్ధంతి ఉత్సవాన్ని జరుపుకున్నారు ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబీసీ జాతీయ అధ్యక్షులు గూడ ఐలయ్య గౌడ్ మాట్లాడుతూ సమైక్య ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదర%శీ% సంజీవయ్య చేసిన సేవలు మరువలేవని బ్రిటిష్ వాళ్ళు మన దేశాన్ని వదిలిన తర్వాత మొదటి పంచవర్ష ప్రణాళికలో ఆంధ్ర రాష్ట్ర దళితముఖ్యమంత్రిగా దామోదరం సంజీవయ్య సేవలు చేశారని అన్నారు నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచారు దేశంలోనే మొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ పార్టీ దళితుని ముఖ్యమంత్రి చేసిందని గుర్తు చేశారు అఖిలభారత కాంగ్రెస్ పార్టీకి జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు నెహ్రూ గాంధీ కుటుంబం ఎస్సీ ఎస్టీ బీసీలకు అనేకమైన రాజకీయ అవకాశాలు కల్పించిన చరిత్ర ఉందని అన్నారు విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల సంక్షేమ హాస్టల్ ఏర్పాటు చేసి విద్యను అందించారని అన్నారు ఈ వర్ధంతి కార్యక్రమంలో ఆల్ ఇండియా రాష్ట్రీ దళిత సేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ అవి జై జేమ్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి వైబాలరాజు ఓబీసీ జాతీయ ఉపాధ్యక్షులు ఏం జనార్ధన్ మాజీ కౌన్సిలర్ గూడవరమ్మ గడ్డమీద కలమ్మ సత్య లక్ష్మి సిహెచ్ లక్ష్మి సులోచన కాంగ్రెస్ నాయకులు యాదగిరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## "పది'లో ది కౌల్డాన్ హైస్కూల్ విద్యార్థిని దేవి షి ఝాన్సీకి అత్యధిక మార్కులు

**దేవేషిని సత్కరించిన పాఠశాల నిర్వాహకులు**



ఎల్బీనగర్, వాయిస్ టుడే: ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో చంపాపేటలోని ది కౌల్డాన్ హైస్కూల్ కు చెందిన విద్యార్థిని గుమ్మల్ల దేవేషి 587/600 మార్కులను సాధించింది. అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థిని గుమ్మల్ల దేవేషిని పాఠశాల నిర్వాహకులు పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులు మాట్లాడుతూ అనుభవం కలిగిన అధ్యాపక బృందంచే పాఠాలను బోధించడం ద్వారా అత్యుత్తమ ఫలితాలను సాధించగలిగామని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

